క్లుప్తంగా

అభివృద్ధి పథంలో నడిపించాలి

బాలాయపల్లె(డక్కిలి): పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ పంచాయతీ నిర్వహణ, మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ మధ్య సమన్వయం సాధించడం కోసం చేపట్టాల్సిన మూల సూత్రాలు, పంచాయతీ సమావేశాల నిర్వహణ, తీర్మానాల అమలుపై అవగాహన పెంచుకోవాలన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ దీప

వాకాడు: మిచాంగ్ తుపాను బాధిత రైతులకు శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ దీప మాట్లాడుతూ పంటలు దెబ్బతిన్న రైతులను గుర్తించి, 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేస్తున్నామన్నారు. రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ముందు చూపుతో విత్తనాలు పంపిణీ చేస్తుందని చెప్పారు. 650 క్వింటాళ్ల విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి అంగన్‌వాడీ సిబ్బంది



అంగన్‌వాడీ కేంద్రం తెరిపిస్తున్న అధికారులు

పెళ్లకూరు: చెంబేడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్ర సిబ్బంది శుక్రవారం విధుల్లోకి వచ్చారు. స్థానిక ఎంపీడీఓ అంగన్‌వాడీ కార్యకర్తతో చర్చించి, ఆమె విధుల్లోకి వచ్చేలా చర్యలు చేపట్టారు. మూడు రోజులుగా కేంద్రానికి వేసిన తాళం తీయించి యథావిధిగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఆయన వెంట నోడల అధికారి అన్నపూర్ణారావు, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన

సైదాపురం: ఓటు నమోదుకు అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను శుక్రవారం ప్రత్యేకాధికారి హైమావతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారి పూర్తి వివరా లను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అలాగే చేర్పులు, మార్పుల దరఖాస్తులను కూడా పరిశీలిస్తామన్నారు.

రాకపోకలకు అంతరాయం



సైదాపురంలో రోడ్డుపై దిగబడి ఉన్న లారీలు

సైదాపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సైదాపురం–పొదలకూరు మార్గంలో రెండు లారీలు ఇరుక్కుపోవడంతో సుమారు రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. పరిమితికి మించిన లోడ్‌తో ఖనిజ సంపదను తరలిస్తున్న రెండు లారీలు ఒకేసారి రోడ్డుపై దిగబడిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులుపడ్డారు. దీంతో వాహన చోదకులు స్పందించి జేసీబీ సహాయంతో లారీలను బయటకు తీయడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ఏనుగులపాళెంలో క్షుద్ర పూజల కలకలం



క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని ఏనుగులపాళెంలో ఉన్న ఓ నివాసం ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి క్షుద్రపూజలకు పాల్పడ్డారు. మహిళ ఇంటి ముందు పళ్లెంలో బొమ్మను తయారు చేసి పూజలు చేసినట్లు గుర్తించా రు. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు అక్కడి చేరుకుని క్షుద్రపూజలు జరిగినట్లు చర్చించుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

క్రీడా సామగ్రి పంపిణీ

చిల్లకూరు: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు శుక్రవారం ఎంపీడీఓ వెంకటసూర్యసాయి క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో సచివాలయస్థాయిలో గెలిచిన వారిని మండలస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. అక్కడ విజేతలుగా నిలిస్తే నియోజకవర్గం, ఆ తరువాత జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు.

కండలేరులో 13.118 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 13.118 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయానికి వరదకాలువ నుంచి 100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఎం జగన్ ఆదేశాలే శిరోధార్యం





మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి జోహర్లు అర్పిస్తున్న నేతలు

- బరిలోకి అందరికీ నచ్చిన, మెచ్చిన అభ్యర్థులే
- జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో విజయమే లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నాయుడుపేటటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలే శిరోధార్యం కావాలని, ఆ మేరకు నాయకులందరూ కలసికట్టుగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. నాయుడుపేటలోని కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం సూళ్లూరుపేట నియోజవర్గంలోని పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి జోహర్లు అర్పించారు. అనంతరం ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఎన్నికల నగరా మోగుతుందని, తిరుపతి జిల్లాలోని ఏడు నియోజవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు విజయం చేకూర్చడమే ప్రధాన లక్ష్యంగా చేసుకుని ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. వై నాట్ 175 నినాదం నిజం చేసేలా ప్రతి నియోజ వర్గంలో అందరికీ నచ్చిన, మెచ్చిన, సరైనా అభ్యర్థుల నియామకంపై జగనన్న సారథ్యంలో పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. మనపై మనం బురద జల్లె విధానాలను నాయకులు విడనాడాలని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ నెలాఖరున జిల్లాలో మంత్రులు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు సారథ్యంలో జరిగే సామాజిక యాత్రను దిగ్విజయం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గతంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా సంజీవయ్య రెండు సార్లు విజయం సాధించారన్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచేలా 62 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో సంజీవయ్య విజయం సాధించిన విషయాన్ని రామ్‌కుమార్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2024 వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి అంతకంటే గొప్ప మెజారిటీ వచ్చేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని చెప్పారు. నియోజవర్గ పరిధిలోని నాయకులు, తదితరులు చెప్పిన అనేక విషయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతామన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు నాయకులందరినీ కలుపుకుని, పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు మాట్లాడవద్దని, పార్టీ అభ్యర్థి నియామకంపై కొందరు చేస్తున్న దుష్ప్రచారం ఎవరు నమ్మవద్దన్నారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట నియోజవర్గ పరిశీలకుడు సుధీర్ కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, టీ సుబ్రహ్మణ్యం రెడ్డి, పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే వెంకటరమణారెడ్డి, నాయకులు కే మాధవరెడ్డి, కే రాజారెడ్డి, కిషోర్‌యాదవ్, అనిల్‌రెడ్డి, జే వేణుయాదవ్, బీ మల్లికారునరెడ్డి, కే జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

తాగునీటి సరఫరాకు చర్యలు



పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: పట్టణంలో నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. దూడలకాలువ సమీపంలో ఇటీవల తుపాను కారణంగా చెరువు కలుజు ఉధృతంగా పారడంతో తాగునీటి సరఫరా అందించే పైపులైన్ దెబ్బతింది. ఆ పైపులైన్ మరమ్మతు పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిచాంగ్ తుపాను కారణంగా గూడూరు నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా జరిగిందన్నారు. ఈ క్రమంలోనే వరద బాధితులను పరామర్శించేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళేనికి వచ్చి ప్రజలు, రైతులకు భరోసా ఇచ్చారన్నారు. నష్టపోయిన వారందరికీ చేయూత అందిస్తామని, ఎవరూ అధైర్య పడవద్దన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు అజీజ్‌ఖాన్, ఏ మురళి, కే అశోక్ ఉన్నారు.

అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

బాలాయపల్లె(డక్కిలి): ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులకు నమోదు చేయాల్సి ఉంటుందని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. ఉపాధిహామీ కార్యాలయం అవరణలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజా వేదికను ఎంపీపీ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 24 పంచాయతీల్లో ఉపాధిహామీ కూలీలు, మెటీరియల్, పంచాయతీరాజ్ తదితర శాఖలకు సంబంధించి రూ.11.42 కోట్ల విలువైన పనులు చేపట్టామన్నారు. ఈ పనులకు సంబంధించి అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.2.27లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. ప్రొసీడింగ్ అధికారిగా పీడీ శ్రీనివాస ప్రసాద్ వ్యవహరించారు. అనంతరం ఆయన ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడారు. గ్రామాల్లో కూలీలకు పనులకు కల్పించాలన్నారు. త్వరలో పనులు జరిగే ప్రాంతానికి తాను వస్తానని, చిన్న పొరపాటు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వరప్రసాద్, ఎంపీడీఓ ప్రమీలారాణి, ఎస్సార్పీ నాగరాజు, ఏపీఓ మృత్యుంజయరావు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ ఎన్‌సీసీ యూనిట్‌కు గుర్తింపు



ఎన్‌సీసీ ఆఫీసర్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌సీసీ ఆర్మీ అండ్ నావల్ యూనిట్ చేస్తున్న సేవలకు తగిన గుర్తింపు లభించినట్లు కళాశాల డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఎన్‌సీసీ బృందానికి, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన యోగా క్యాంప్‌లు ,మొక్కల పెంపకం, పునీత్ సాగర్ అభియాన్, రక్తదాన శిబిరాలు, ఫిట్ ఇండియా రన్ తదితర సేవలను గుర్తించి, ఎన్‌సీసీ గుంటూరు గ్రూప్ కమాండెంట్ కల్నల్ చంద్రశేఖర్ ప్రశంసాపత్రం అందజేశారు. ఎన్‌బీకేఆర్‌కు తగిన గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని కళాశాల డైరెక్టర్ తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి కృషిని రామ్‌కుమార్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కోట: మండలంలో ఓటర్ల జాబితా తయారీ పారదర్శకంగా రూపొందించాలని ప్రత్యేకాధికారి అహ్మద్ బాషా తెలిపారు. మండలంలో బీఎల్వోలు చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ అక్టోబర్ 27 నుంచి 52 పోలింగ్ స్టేషన్ల పరిధిలో బీఎల్వోలు ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టారు. బీఎల్వోలు రూపొందించిన జాబితాలో కొత్తగా చేరికలు 119, తొలగింపులు 67, సవరణలు 35 ఉన్నట్లు తెలిపారు. పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించే క్రమంలో మరోసారి సమీక్ష జరిపినట్లు తెలిపారు. డీటీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

హైబ్రిడ్ పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

వాకాడు: మండలంలోని ముట్టెంబాక గ్రామంలో శుక్రవారం హైబ్రీడ్ పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. వాకాడు జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ దాతృత్వంతో అందజేసి, 500 హైబ్రీడ్ పండ్ల మొక్కలు అందజేశారు. ప్రతి ఇంటికీ మామిడి, కొబ్బరి మొక్కలను రెండు చొప్పున అందజేశారు. అలాగే గ్రామంలోని పాఠశాల ఆవరణలో అవసరమైన మొక్కలు నాటారు. రామకృష్ణ దాతృత్వంతో వాకాడు మండలంతోపాటు ఇతర మండలాల్లో దాదాపు 18 వేల హైబ్రీడ్ పండ్ల మొక్కలను ఉచితంగా అందజేశారు. గ్రామాల్లో పచ్చదనం పెంపునకు మరో 4 వేల మొక్కలను పంపిణీకి సిద్ధం చేసినట్లు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్ అనిల్‌కుమార్‌రెడ్డి, మధురెడ్డి, రౌతు నాగరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు



చిల్లకూరు: సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

చిల్లకూరు: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు శీనయ్య తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పార్టీలు, కులాలు మతాలకతీతంగా అర్హతను ప్రామాణికంగా చేసుకుని, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా అందించే లబ్ధిని నేరుగా వలంటీర్లు, బ్యాంకుల ద్వారా అందిస్తున్నారని చెప్పారు. ఇలా దేశంలో ఎక్కడ కూడా నేరుగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులు చేర్చిన దాఖలాలు లేవన్నారు. ఇలా పాలన కొనసాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైపు ప్రతి రాష్ట్రంలోని పాలకులు చూస్తూ ఇక్కడ పథకాలను అమలు చేసేందుకు సిద్ధ పడుతున్నారని చెప్పారు. అనంతరం వలంటీర్లకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.హరిత, ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ డీ దిలీప్‌రెడ్డి , ఈఓపీఆర్డీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ మార్గాలను ఎంచుకోవాలి

చిల్లకూరు: ప్రతి పంచాయితీకి ఆదాయ మార్గాలను గుర్తించి, తద్వారా అభివృద్ధి చేయాలని శిక్షకుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకుడు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఆదాయ మార్గాలు ఉంటాయని, అయితే వాటిని గుర్తించనందున పంచాయతీని అభివృద్ధి చేయలేక పోతుంటామన్నారు. వీటిని అంది పుచ్చుకుంటే ఆ సమస్య ఉండదని చెప్పారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటసూర్యసాయి, ఈఓపీఆర్డీ మాణిక్యం, శిక్షకులు రాజా, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అరుణారెడ్డి

ఓజిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అధికారులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ రజనీకాంత్ అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి అందజేయాలన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అనంతరం విద్య, వైద్యం, ఉపాధి, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, పీఏసీఎస్ అధ్యక్షులు రాజారామిరెడ్డి, శోభారాణి, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కార్యదర్శులకు శిక్షణ

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ సురేష్‌బాబు పంచాయతీ కార్యదర్శులకు సాధారణ పరిపాలన ప్రక్రియపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఓ అన్నపూర్ణరావు, ఈఓపీఆర్డీ విజయమ్మ, పాల్గొన్నారు.

సచివాలయ అడ్మిన్లకు అంగన్‌వాడీల బాధ్యతలు

వెంకటగిరి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను సచివాలయాల అడ్మిన్లకు అప్పగిస్తూ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్య ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుకుని స్థానిక వార్డు కౌన్సిలర్, గృహసారథులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల సహకారంతో తాళాలు తీసి పౌష్టికాహారం పంపిణీకి చర్యలు చేపట్టారు. ప్రాథమిక పాఠశాలల సమీపంలో ఉన్న కొన్ని అంగన్‌వాడీ సెంటర్ల పిల్లలకు ఆ పాఠశాలల్లోనే అమలవుతున్న జగనన్న గోరుముద్ద ద్వారా భోజనం అందజేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్య మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలంటూ నాలుగు రోజులుగా అంగన్‌వాడీ సెంటర్లకు తాళాలు వేసి, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తుండడంతో బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు అందాల్సిన పౌష్టికాహారం పంపిణీలో జాప్యం జరుగుతుండడాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

సాయం.. శరవేగం



దొరవారిసత్రం: నగదు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

దొరవారిసత్రం: తుపాను బాధితులకు ప్రభుత్వం శరవేగంగా సాయం అందజేస్తోంది. కాళంగి నది పరివాహక ప్రాంతంలోని తల్లంపాడు, బుదరమడుగు పరిధిలో ముంపునకు గురైన 97 ఎస్టీ కుటుంబాలకు శుక్రవారం ప్రభుత్వ సాయం కింద రెవెన్యూ అధికారులు నగదు అందజేశారు. ముంపునకు గురైన ఇళ్లలో ఒక్కరు ఉన్న వారికి రూ.వెయ్యి, ఇద్దరున్న వారికి రూ.2 వేలు, అంత కంటే ఎక్కువ ఉన్న వారికి రూ.2500 చొప్పున రూ.2.21 లక్షలు నగదు అందజేసినట్లు తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు.

సైదాపురంలో..

సైదాపురం: మండలంలోని పొలూరు రాజుపాళెంలో శుక్రవారం వరద బాధితులకు ప్రభుత్వం అందించే నగదు, నిత్యావసర సరుకులను వైఎస్సార్‌సీపీ మండల నేత శ్రీనివాసులురాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రఘుయాదవ్ పాల్గొన్నారు.



రాపూరు: నగదు అందిస్తున్న శ్రీనివాసులు

రాపూరులో..

రాపూరు: తుపాను బాధితులకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్థిక సాయం అందించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 272 బాధితులకు ఆర్థిక సహాయంతో పాటు సరుకులు అందజేశామన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: తుపాను బాధితులకు ప్రభుత్వం ద్వారా అందించే నగదును శుక్రవారం మండలంలోని కలవకొండ, ఉడతావారిపాళెం గ్రామాల్లో బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు ఎస్ చంద్రారెడ్డి, సర్పంచ్ పీ వజ్రమ్మ, యు. సుభాషిణి పాల్గొన్నారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: తుపాను బాధితులను ఆదుకునేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాయం అందిస్తున్నారని మొలకలపూడి సచివాలయ కన్వీనర్ సుంకరకృష్ణ అన్నారు. మండలంలోని మొలకలపూడిలో బాధితులకు ఆర్థికసాయం పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు భోజనాలు

చిల్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమ్మె చేస్తున్న నేపథ్యంలో గూడూరు అర్బన్, రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అధిక భాగం కేంద్రాల్లో పిల్లలకు సచివాలయ సిబ్బందితో భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లోని సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా సీడీపీఓ మహబూబీ అందరిని సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించారు.

9వ బెటాలియన్‌లో అమరజీవి వర్ధంతి



పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్, సిబ్బంది

వెంకటగిరి రూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్ ఆధ్వర్యంలో అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీపొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని, నేటితరం మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్‌కన్నా, సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి సేవలు మరవలేనివి

సైదాపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరవలేనివని తహసీల్దార్ శ్రీనివాసులు కొనియాడారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఆర్ఐ నారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

సైదాపురంలో జోరువాన



సైదాపురంలో కురుస్తున్న వాన

సైదాపురం: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తరు పాలు చిరుజల్లులు కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మళ్లీ వర్షం కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

పెళ్లకూరు: మండలంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై చలిగాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మిచాంగ్ తుపాను కారణంగా పంటలు దెబ్బతిన్నాయని, మళ్లీ వర్షాలు వస్తే మిగిలిన పంటలు కూడా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: మండలంలో విపరీతమైన చలిగాలులు వీస్తూ మోస్తరుగా వర్షం కురుస్తోంది. ఈ వర్షానికి మళ్లీ పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అద్దె చెల్లించాలి

కోట: స్థానిక బజారువీధిలోని దుకాణ యజమా నులు పంచాయతీకి బకాయి పడిన అద్దెను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన దుకాణ యజమానులతో మాట్లాడారు. కోర్టు ఆదేశాల మేరకు 25 దుకాణాల యజమానులు 63 నెలలకు అద్దె చెల్లించాల్సి ఉందన్నారు. వ్యాపారులు స్పందించని పక్షంలో ఖాళీ చేయించి, వేలం పాటలు నిర్వహించి, కొత్త వారికి దుకాణాలు కేటాయిస్తామన్నారు.